క్లుప్తంగా

ఘనంగా వ్రతం



పోరుమామిళ్ల: వ్రతంలో పాల్గొన్న మహిళలు

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి దేవస్థానంలో మంగళవారం శ్రీ వేంకటేశ్వరస్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. పట్టణ ఆర్యవైశ్య మహిళలు వ్రతం సాంప్రదాయబద్ధంగా ఆచరించారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదాలు పంపిణీ చేశారు. మంగళవారం రాత్రి వెంకటేశ్వర స్వామి జీవిత చరిత్ర పారాయణం చేశారు.

నేడు మండల సమావేశం

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10–30 గంటలకు సభాభవనంలో మండల అధ్యక్షురాలు తహసిన్ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ చంద్రమౌళి తెలిపారు. సమావేశంలో అన్ని శాఖల పనితీరుపై సమీక్ష, మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, రేషన్ కార్డులు, ఇంటిపట్టాలపై సమీక్ష ఉంటుందన్నారు. ఎంపీటీసీలు, జడ్పీటీసీ, కో ఆప్షన్ మెంబర్, సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన మైదుకూరు విద్యార్థులతో శిక్షకులు

మైదుకూరు : బెంగళూరులో జరిగిన మొదటి ఓపెన్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్ షిప్‌లో మైదుకూరు విద్యార్థులు ప్రతిభ చూపారు. పట్టణంలోని ఆల్ఫోన్స్ లిగోరి స్కూల్, జోసెఫ్ స్కూల్ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని 19 బంగారు, 6 రజతం, 6 కాంస్య పతకాలను సాధించినట్లు తైక్వాండో మాస్టర్ జిలానీ బాషా, కోచ్‌లు సగిలి సాగర్ యూన్సీ, బీవీ బాలాజీ మంగళవారం తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చూపి పతకాలు సాధించడం పట్ల లిగోరి స్కూల్ చైర్మన్ ఎంఎం బాషా, కరస్పాండెంట్ ఇందిరా జయదేవి హర్షం వ్యక్తం చేశారు.

ఘన నివాళి

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని మడకలవారిపల్లెకు చెందిన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగసుబ్బారెడ్డి తండ్రి సుబ్బారెడ్డి అనారోగ్య కారణాలతో సోమవారం రాత్రి మృతిచెందాడు. ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఈ విషయం తెలుసుకుని మంగళవారం ఉదయం సుబ్బారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు సైకిల్‌యాత్ర

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆడ పిల్లల రక్షణ కోసం సేవ్ గర్ల్ చైల్డ్ ప్రాజెక్టు మహేష్ ఆర్ట్స్ నిర్వాహకుడు తుపాకుల రామాంజనేయులరెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసేందుకు సైకిల్‌యాత్ర ప్రారంభించారు. మంగళవారం స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రం నుంచి ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌సీపీఈ అధ్యాపకుడు మధుసూదన్‌బాబు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పక్కాగా చేపట్టాలి

కాశినాయన : బీఎల్‌ఓలు ఓటర్ల జాబితాను పక్కాగా చేపట్టాలని బద్వేలు ఆర్డీఓ ఆకుల వెంకటరమణ పేర్కొన్నారు. మంగళవారం నరసాపురం తహసీల్దారు కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ బీఎల్‌ఓలు ప్రతి ఇంటికి వెళ్ళి ఓటర్లతో మాట్లాడాలన్నారు. 18 సంవత్సరాలు పూర్తయిన వారు ఉంటే ఓటర్లుగా నమోదు చేయాలని, అలాగే మరణించిన వారు, గ్రామాల్లో లేని వారి ఓట్లను తొలగించాలని ఆదేశించారు. ప్రతి ఓటుకు ఆధార్‌ను అనుసంధానం చేయాలని తెలిపారు. సమావేశంలో తహసీల్దారు రామచంద్రుడు, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కలసపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ బోదనబోయిన నిర్మలదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మహబూబ్‌బీ తెలిపారు.

తెలుగు భాష గొప్పతనాన్ని మరువ కూడదు

ప్రొద్దుటూరు కల్చరల్ : తెలుగు భాష గొప్పతనాన్ని మరువకూడదని శ్రీవెంకటేశ్వర డిగ్రీకళాశాల కరస్పాండెంట్ అర్కటవేముల హరినారాయణ పేర్కొన్నారు. కళాశాలలో మంగళవారం తెలుగుభాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. వ్యాసరచన, క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ గౌరీశంకర్, ప్రిన్సిపాల్ ముస్తఫా, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వేషధారణ

స్థానిక వైఎంఆర్ కాలనీలోని గౌతమ్ హైస్కూల్‌లో మంగళవారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తెలుగు తల్లి వేషధారణ, గిడుగు రామ్మూర్తి పంతులు వేషధారణలో అందరిని ఆకట్టుకున్నారు. విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్ సుధీర్ నాయుడు, డైరెక్టర్ మునిస్వామి నాయుడు తెలుగు భాష గొప్పతనాన్ని, తెలుగు భాషా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధనలక్ష్మి, ఉపాధ్యాయులు మునిలక్షుమ్మ, హర్ష తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సేవా కేంద్రంలో..

స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో మంగళవారం జాతీయ తెలుగు భాష, క్రీడా దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వ్యావహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులు 160వ జయంతి, హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ 118వ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ వాడుక భాషను వేడుక భాషగా చేసిన మహనీయుడు గిడుగు రామమూర్తి అని కొనియాడారు. ఒలంపిక్స్ చరిత్రలో హాకీలో ధ్యాన్ చంద్ ఒంటి చేత్తో మనకు మూడు పతకాలు సాధించి పెట్టాడన్నారు. కార్యక్రమంలో రచయిత జింకా సుబ్రహ్మణ్యం, విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు ఓబుళరెడ్డి, భాగవతార్ యడవల్లి రమణయ్య, హరి, వెంకటేష్ పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు కల్చరల్ : బహుమతులు అందజేస్తున్న హరినారాయణ

చదువులో దివ్యాంగులను ప్రోత్సహించాలి

ప్రొద్దుటూరు : దివ్యాంగ విద్యార్థులు చదువుపై మరింత ఆసక్తిని పెంచుకునేలా ప్రోత్సహించాలని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని గోపవరం పంచాయతీ ఏపీహెచ్‌బీ కాలనీలోని భవిత పాఠశాలలో వైకల్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులను చిన్న చూపు చూడరాదని, మనతో సమానంగా చూసుకోవాలని సూచించారు. దివ్యాంగులను హేళన చేకూడదని, గౌరవించాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఐఈఆర్టీ సిబ్బంది, రాస్ కళాశాల బీఈడీ విద్యార్థులు చంద్రకళ, సత్యవతి, నిర్మల, హేమ, హావిల పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు కల్చరల్ : గిడుగు, ధ్యాన్ చంద్ చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

తెలుగుభాష వైభవాన్ని కాపాడుకుందాం

బద్వేలు అర్బన్ : తెలుగుభాష వైభవాన్ని, విశిష్టతను కాపాడుకుందామని చిన్నకేశంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఉమాకాంత్ పేర్కొన్నారు. తెలుగుభాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పాఠశాలలో తెలుగుభాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ భాషల్లోనే మధురమైన భాష తెలుగు అని తెలిపారు. తెలుగు ఉపాధ్యాయులు మాదన విజయకుమార్ పాల్గొన్నారు.



బద్వేలు అర్బన్ : మాట్లాడుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమాకాంత్

మాతృభాషా దినోత్సవం

పోరుమామిళ్ల : సగిలేరు అంబేద్కర్ గురుకుల పాఠశాలలో వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకొని వారం రోజులు విద్యార్థులకు వ్యాసరచన, పద్య రచన పోటీలు నిర్వహించారు. మంగళవారం తెలుగు పండితులు చెన్నయ్య, సుబ్బయ్యల ఆధ్వర్యంలో పోటీలలో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందచేశారు. సీనియర్ ఉపాధ్యాయులు భాస్కరరావు, శివప్రసాద్‌లు మాట్లాడారు.

ఘనంగా తెలుగుభాష దినోత్సవం

కలసపాడు : మండలంలోని ఎగువ రామాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం గిడుగు రామ్మూర్తి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కమాల్ మాట్లాడుతూ తెలుగుభాషను అందరూ కాపాడుకోవాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత, మాధవి, బాలఓబులయ్య, బ్రహ్మానంద రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు గంగిరెడ్డి



పోరుమామిళ్ల: పోటీలలో గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

అమ్మభాషలోనే ఆత్మీయత

కాశినాయన : అమ్మభాషలోనే ఎంతో ఆత్మీయత లభిస్తుందని మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య పేర్కొన్నారు. మంగళవారం పాఠశాలలో తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కృత్రిమ ఆంగ్ల సంస్కృతిలో ప్రేమానురాగాలు దూరమవుతున్నాయని, అమ్మ, నాన్న అన్నప్పుడే మాధుర్యం లభిస్తుందన్నారు. అనంతరం విద్యార్థినులు ధరించి నృత్యాలు చేశారు. వైస్ ప్రిన్సిపల్ బాలిరెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

మైదుకూరు : ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడులు తగ్గించి అధిక ఆదాయాన్ని పొందవచ్చని రైతు సాధికార సంస్థ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన మైదుకూరు మండలంలోని పప్పనపల్లె, ఆదిరెడ్డిపల్లె పంచాయతీల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లోని ఏటీఎం మోడల్స్‌ను పాటిస్తున్న రైతులను, జిల్లా ప్రకృతి వ్యవసాయ డీపీఎం రామకృష్ణరాజుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు పాటిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, పొందుతున్న ఆదాయం గురించి తెలుసుకున్నారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తూనే మోడల్స్‌ని కూడా పాటించి, నాటిన నెల నుంచే ఆదాయం పొందవచ్చన్నారు. ఆరోగ్యమైన ఆహారాన్ని తింటూ సంవత్సరం పొడుగునా ఆదాయాన్ని పొందుతూ భూసారాన్ని పెంపొందించుకోవచ్చు అని తెలిపారు. డీపీఎం రామకృష్ణరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు ఇప్పటి వరకు పెట్టుబడి తగ్గించుకోవడంతోపాటు ఆదాయాన్ని పొందుతున్నారన్నారు. ఇప్పుడు ఏటీఎం, ఏ గ్రేడ్ మోడల్ వల్ల ఒకే పంట కాకుండా ప్రధాన పంటలో మోడల్స్ వేస్తూ మరింత ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం వసంతకుమారి, మోడల్ మేకర్ ఆదినారాయణ, సిబ్బంది వెంకటేశ్వరరెడ్డి, అభ్యుదయ రైతు రామనందరెడ్డి, కాశినాయన, వెంకటరామయ్య, ఓబయ్య పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న రైతు సాధికార సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్

తెలుగు భాషను విస్మరించరాదు

మైదుకూరు : తెలుగు భాషను విస్మరించరాదని మైదుకూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం జరిగిన కార్యక్రమంలో వక్తలు పేర్కొన్నారు. పాఠశాల ఉపాధ్యాయిని పద్మజ అధ్యక్షతన తెలుగు తల్లి, గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ తెలుగు భాషను విస్మరిస్తే కన్నతల్లిని విస్మరించినట్టేనని తెలిపారు. ప్రపంచ భాషల్లో తెలుగు భాష 15వ స్థానంలో ఉందని, దేశంలో రెండో స్థానం నుంచి దిగజారడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో విజేతలైన వారికి పుస్తకాలను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో తెలుగు సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు, కథా రచయిత తవ్వా ఓబుల్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మైదుకూరు: జెడ్పీ హైస్కూల్‌లో గిడుగు రామ్మూర్తి పంతులుకు నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణ రెడ్డి అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా వికాసానికి చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. తెలుగు భాషపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, ప్రాసాక్షర పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

వైభవంగా జాతీయ క్రీడా దినోత్సవం

ప్రొద్దుటూరు : మండలంలోని గోపవరం వద్ద ఉన్న ప్రభుత్వ పశువైద్య కళాశాలలో మంగళవారం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వైకుంఠరావు, ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ వైకుంఠరావు మాట్లాడుతూ నిత్య జీవితంలో ఆరోగ్యంగా ఉండటానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ అధికారులు పి.విద్యాసాగర్, వి.మానస, ఎస్.వాణి, పి.రేవతి, కళాశాల వ్యాయామ అధ్యాపకురాలు జి.హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడాదినోత్సవం


పోరుమామిళ్ల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషాదినోత్సవం నిర్వహించారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్, తెలుగుభాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సోమ, మంగళవారాల్లో విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నాగేశ్వరరెడ్డి, తెలుగు అధ్యాపకులు మహమ్మద్‌రఫీ, సీనియర్ అధ్యాపకులు పాల్గొన్నారు.



విజేతలతో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వైకుంఠరావు, సిబ్బంది

ఎగ్జిబిషన్ వేలం పాట రూ.1.17 కోట్లు

ప్రొద్దుటూరు : దసరా సందర్భంగా నిర్వహించనున్న ఎగ్జిబిషన్ వేలం పాట రూ.కోటి 17 లక్షలు పలికింది. మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య ఆధ్వర్యంలో మంగళవారం వేలం పాట నిర్వహించారు. సర్కారు వారి వేలంపాటను రూ.1.16 కోట్లకు పిలవగా రూ.1.17 కోట్లతో సిద్ధా వెంకటరామిరెడ్డి దక్కించుకున్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా 45 రోజులపాటు అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో నిర్వహించే ఎగ్జిబిషన్‌కు వేలం పాట నిర్వహించారు. మొత్తం 7 మంది కాంట్రాక్టర్లు ఇందులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆదేశాల మేరకు ఈ ఏడాది కూడా ఎగ్జిబిషన్ ప్రవేశం ఉచితంగా కల్పించాలని గత నెలలోనే కౌన్సిల్ తీర్మానించింది. హక్కుదారుడు కేవలం ఎగ్జిబిషన్‌లోని వినోద పరికరాలతోపాటు వాహనాల పార్కింగ్‌కు రుసుం వసూలు చేయాల్సి ఉంది. ఆర్‌ఐ శివచరణ్‌రెడ్డి పాల్గొన్నారు.



వేలం పాట నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఎన్నికలప్పుడే రాజకీయాలు

ప్రొద్దుటూరు : కేవలం ఐదేళ్లకోమారు ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేస్తామని మిగతా సమయమంతా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకే కేటాయిస్తామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్టీపీపీ రోడ్డులోని బ్రాహ్మణ శ్మశాన వాటికలో రూ.25లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత నాలుగేళ్లలో ప్రొద్దుటూరు పట్టణంతోపాటు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.అమృత్ పథకం ద్వారా తాగునీటి సౌకర్యాన్ని కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, 28వ వార్డు కౌన్సిలర్ పాతకోట మునివంశీధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, డీఈ దస్తగిరి, బ్రాహ్మణ సంఘం ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రకాష్ నగర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

ఇచ్చిన మాట మేరకు కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రకాష్ నగర్ కాలనీలో మంగళవారం ఉదయం నుంచి సిమెంటు రోడ్డు పనులను ప్రారంభించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పర్యటించినప్పుడు స్థానికులు సమస్యలను వివరించారు. ఆ మేరకు తన సొంత డబ్బు రూ.3.40 కోట్లతో సిమెంటు రోడ్లు, డ్రైనేజి కాలువలను నిర్మిస్తానని సోమవారం రాత్రి జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ ప్రకారం కాంట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి పనులు ప్రారంభించారు.



అభివృద్ధి పనులకు భూమి పూజ సందర్భంగా బ్రాహ్మణులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సచివాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మంగళవారం సాయంత్రం ప్రకాశ్‌నగర్ గ్రామ సచివాలయానికి వెళ్లి ప్రజల వినతులను స్వీకరించారు. సమస్యల పరిష్కారంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి గురుమోహన్‌తోపాటు సచివాలయ ఉద్యోగులతో మాట్లాడారు. కార్యక్రమంలో పూసల కార్పొరేషన్ డైరెక్టర్ తుపాకుల వెంకటరమణ, సచివాలయ కన్వీనర్ కంభం వెంకటేశు, ఎంపీటీసీ బాలాజీ నివాస్ తదితరులు పాల్గొన్నారు.

డీలర్లు బెదిరిస్తున్నారు

ప్రొద్దుటూరు : ప్రభుత్వం మంజూరు చేసిన సరుకులు తమకు సరఫరా చేయకుండా రేషన్ డీలర్లు బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని పట్టణంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పలువురు మంగళవారం తహసీల్దార్ నజీర్ అహ్మద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. బియ్యం, కందిపప్పు, పామాయిల్‌ను ప్రతి నెల ప్రభుత్వం సరఫరా చేస్తోందని, వీటిని తమ అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకురావాల్సిన బాధ్యత ఎండీయూలపై ఉందన్నారు. సమయానికి సరుకులు అందక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. అయితే డీలర్లు ఇందుకు సహకరించకుండా పరోక్షంగా తమను బెదిరిస్తున్నారన్నారు. సరుకులకు డబ్బులు ఇవ్వాలని కోరుతున్నారని తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు.



తహసీల్దార్ నజీర్ అహ్మద్‌కు వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కంటి వెలుగు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి

చాపాడు : ప్రభుత్వం చేపట్టిన అవ్వాతాతలకు కంటి వెలుగు పథకాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని వైద్యాధికారి డాక్టర్ శ్రీవాణి పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం కంటి వెలుగు లబ్ధిదారులకు కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల కంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కంటి వెలుగు పథకం తీసుకువచ్చిందన్నారు. దీని ద్వారా ప్రతి గ్రామ సచివాలయ పరిధిలోని ప్రత్యేక శిబిరం నిర్వహించి కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు చేసి మందులు ఇవ్వటంతోపాటు కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. అలానే మండలంలోని పల్లవోలు, అల్లాడుపల్లె విలేజ్ క్లినిక్‌ల వద్ద కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఓబులేసు, ఆప్తాలమిక్ అసిస్టెంటు తేజ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కంటి అద్దాలు అందిస్తున్న వైద్యాధికారులు శ్రీవాణి, ఓబులేసు

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

బద్వేలు అర్బన్ : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే పి.ఎం.కమలమ్మ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ సత్తార్‌లు పేర్కొన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గస్థాయి కో ఆర్డినేషన్ మెంబర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, ప్రత్యేక హోదా విషయంలో రాష్ట్రానికి చేసిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తూ ముందుకు సాగాలని కోరారు. సమావేశంలో పీసీసీ వైస్ ప్రెసిడెంట్ జె.ప్రభాకర్, పీసీసీ సెక్రటరీ ఇమాంసాహెబ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అచ్యుతరాజు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.





నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్యాలయంలోని సభాభవనంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

అందుబాటులో డీఏపీ

గోపవరం : గోపవరం రైతుభరోసా కేంద్రంలో డీఏపీ ఎరువులు అందుబాటులో ఉన్నట్లు బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. 50 కిలోల బస్తా ధర రూ.1350లు చెల్లించి అవసరమైన రైతులు తీసుకెళ్లాలన్నారు. ఏ పంటకైనా ఈ ఎరువును వాడుకోవచ్చన్నారు.



సంచార జాతుల సభ విజయవంతం చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : భారతదేశ విముక్తి సంచారజాతుల స్వాతంత్ర్య దినోత్సవ మహాసభ ఈనెల 31న రాజమహేంద్రవరంలో జరగనుందని, దీనిని విజయవంతం చేయాలని జిల్లా సంచారజాతుల సంఘం అధ్యక్షుడు కత్తి విజయకుమార్ పేర్కొన్నారు. స్థానిక బుడజంగం కాలనీలో సభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2008లో బాలకృష్ణ రేణుకే కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకారం సంచార జాతులకు 10శాతం ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంచారజాతుల సంఘం నాయకులు గంగిరెడ్డుల తిరుమలయ్య, బేడబుడగ జంగం కొండయ్య, దొమ్మర నాగసుబ్బయ్య, యానాది చెన్నయ్య, మెండిబండ వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

